క్లుప్తంగా

గానాల రామ్మూర్తి చిరస్మరణీయుడు

విజయనగరం టౌన్: విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ బ్రహ్మశ్రీ రావు బహుదూర్ పండిత గానాల రామ్మూర్తి అని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక కర్రల మార్కెట్‌లో రామ్మూర్తి 131వ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కాముల శ్రీనివాసరావు, కోశాధికారి సాంబమూర్తి, సంఘ ప్రతినిధులు సుందరరావు, నాగరాజు, యడ్ల పల్లి బ్రహ్మాజీ, సింహాద్రి, శ్రీను, హరి, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓ కనకరాజుపై టీఏ ఫిర్యాదు

పూసపాటిరేగ: ఉపాధిహామీ పథకం మండల ఏపీఓ గువ్వల కనకరాజు తనను దుర్భాషలాడుతూ వేధిస్తున్నాడని ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ ఎల్.భవానీ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 13న గుంపాం సీనియర్ మేట్ బొబ్బాది రామకృష్ణ ఎదుట తమను ఏక పదజాలంతో దుర్భాషలాడుతూ దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జరిగిన విషయాలను ఎంపీడీఓ జి.రామారావు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. దీనిపై ఎస్సై నరేష్ స్పందిస్తూ విషయాన్ని ఉపాధి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఘనంగా పురందర దాసుల ఆరాధన

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురందరదాసుల ఆరాధన ఉత్తరాది మఠంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా దాసు చిత్రపటానికి నిర్వాహకులు పూలమాలలు వేసి, సంకీర్తనాలాపన చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, డాక్టర్ మండపాక రవి, ధన్వాడ శ్రీనివాసరావు, డాక్టర్ అయ్యగారి రాఘవరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి

నెల్లిమర్ల రూరల్: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ సూచించారు. మండలంలోని కొండవెలగాడలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారమ్మ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించగలిగితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాదరావు మాట్లాడుతూ, క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదన్నారు. మహిళల్లో వచ్చే రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్లపై అవగాహన పెంచుకొని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు లెనిన్, స్వప్నగాయత్రి పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం పెంపొందించాలి

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ సోకిన వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని ఐసీటీసీ సెంటర్ల జిల్లా సూపర్‌వైజర్ నూకసాక్షి గోపాలరావు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఐసీటీసీ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ అయిన వారి వివరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవీ సోకిన వ్యక్తితో సంసారంలో ఉన్న వారికి కూడా హెచ్ఐవీ పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో కె. రామకృష్ణ, పేరిశెట్టి సూర్యారావు, హరినాథవు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలి



ఈఈ సుదర్శనం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై నిర్వహిస్తున్న సమావేశం

విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధించడం జరుగుతుందని కాలుష్య నియంత్రణమండలి పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు, ఇంపోర్టర్లు, బ్రాండ్ ఓనర్లు, రీసైకిలర్లు, వేస్టు కలెక్షన్ కేంద్రాల నిర్వాహకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలుష్య నియంత్రణ మండలి సూచనలు, ఆదేశాల మేరకు పీటీఈ అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయు విధివిధానాలను వివరించారు. పీఆర్ రిజిస్ట్రేషన్లు, కలెక్షన్ కేంద్రాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు. గతేడాది డిసెంబర్ 31 నుంచి 120 మైక్రాన్లు కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులను నిషేధించినట్లు చెప్పారు. అలాగే ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ క్రమంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: నగరంలోని 14వ డివిజన్‌లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నదీ ఆరా తీశారు. ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు అందడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అమ్మఒడి, చేయూత, వసతిదీవెన, విద్యాదీవెన, రైతుభరోసా, పేదలకు ఇళ్లు, తదితర పథకాలు అర్హులందరికీ అందుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రజా సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అడిగి తెలుసుకున్నారు. వీధిలైట్లు లేవని కొందరు చెప్పగా వెంటనే అక్కడున్న సిబ్బందిని పిలిచి తక్షణమే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోలగట్ల ఆదేశించారు. అద్యంతం ఆనందంగా సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉద్దేశించి మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ, అభివృద్ధి పాలనను అందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, స్థానిక కార్పొరేటర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా అవినీతి రహిత పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసరపు రామకృష్ణ, బొంగ భానుమూర్తి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఔదార్యం

- క్షతగాత్రులను సొంత కారులో ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రులను కారులో ఎక్కిస్తున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు

నెల్లిమర్ల: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని తన కారులో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్సీ సురేష్‌బాబు తన కారులో శనివారం మధ్యాహ్నం విజయనగరం–పాలకొండ రహదారిలో వెళ్తున్నారు. స్థానిక ఊటగెడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముళ్లు తీవ్రంగా గాయపడి, రోడ్డుపై పడి ఉండడాన్ని చూసి, వెంటనే వారిని తన కారులో మిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి ఏఓ గణేష్‌కు సూచించారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం రేపు

విజయనగరం టౌన్: వాసవీ కన్యక పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 9 గంటలకు అమ్మవారు వజ్రకిరీటంతో పాటూ స్వర్ణ వస్త్ర అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మాఫరిణ్



భోగాపురం: మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫరిణ్



విజయనగరం క్రైమ్: ఆర్అండ్‌బీ వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, తదితరులు

భోగాపురం: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ అస్మాఫరిణ్ అన్నారు. మండలంలోని ముంజేరు సమీపంలో ఉన్న మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో యువత ఎక్కువగా మద్యం, డ్రగ్స్, సారా, గంజాయి వంటి మాదకద్రవ్యాల వైపు మొగ్గు చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు పాడవుతాయన్నారు. డ్రగ్స్ స్వల్పకాలిక ఆనందాన్ని ఇచ్చినా భవిష్యత్‌లో దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు, గురువులు సూచించిన మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాలలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఎంఆర్‌వీ అప్పారావు, సీఐ కేకేవీ విజయనాథ్, ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు, ఎస్సై వెంకటరావు, డా.తిరుపతిస్వామి, ఎస్‌జీఓ నజీరు, బెహర శ్రీనివాసరావు(డీన్), కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ చల్లా త్రినాథరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు..

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్అండ్‌బీ జంక్షన్, తదితర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎందరో విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడి నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. గంజాయి, హెరాయిన్, కొకైన్, నల్లమందు వంటివి సేవించడం వల్ల చిన్న వయసులోనే మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్‌ల అందజేత



బాధితుడికి బ్యాగ్ అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు



బాధితుడికి బ్యాగ్ అందజేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: గరివిడికి చెందిన కోరాడ అచ్చుంనాయుడు శనివారం ఆటోలో ప్రయాణిస్తూ బ్యాగ్‌ను మరిచిపోయాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ బి. వెంకటరావు స్పందించి ఆటోను ట్రేస్ చేసి బ్యాగ్ స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులు తీరు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సులో....

విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న బస్సులో తన ల్యాప్‌టాప్‌తో పాటు విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను శ్రీనివాసరావు అనే వ్యక్తి మరిచిపోయాడు. గమనించిన బస్సు డ్రైవర్ ఎస్.ఎస్.రాజు వెంటనే డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావుకు అప్పగించారు. దీంతో ఆయన బాధితుడ్ని గుర్తించి బ్యాగ్ అందజేశారు.

కొప్పెర్ల సర్పంచ్ రమణ మృతి



పైడి వెంకటరమణ (ఫైల్)

పూసపాటిరేగ: కొప్పెర్ల సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పైడి వెంకటరమణ (60) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఈయన కొప్పెర్ల సర్పంచ్‌గా రెండుసార్లు.. పీఏసీఎస్ అధ్యక్షుడిగా రెండుసార్లు సేవలందించారు. కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమణ విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. మృతుడికి భార్య పార్వతి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనువాసురాజు, కందుల రఘుబాబు, పతివాడ అప్పలనాయుడు సంతాపం తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న రమణ, కృష్ణారావు

నెల్లిమర్ల: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎల్‌వీ రమణ, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యాచ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 13 బాలురు, 13 బాలికల జట్లు పాల్గొంటాయన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు క్రీడాకారులు, క్రీడాభిమానులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం నల్లా జగదీశ్వరరావు, పీడీ ఎస్. సూర్యారావు, సీఆర్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

ఈ నెల 26 నుంచి ఫ్లెక్సీల నిషేధం

- కమిషనర్ బాలాజీ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పంచాయతీలో ఈ నెల 26 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నట్లు కమిషనర్ పి. బాలాజీప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా రిసోర్స్‌పర్సన్లు, సచివాలయాల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే 120 మైక్రాన్ల మందం లోపు కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు, సంచులను పట్టణంలో పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలను కూడా నిషేధిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో ఫ్లెక్సీల ప్రదర్శనతో పాటు తయారీ, విక్రయాలు, ముద్రణను కూడా నిషేధించామన్నారు. సమావేశంలో మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు..



నెల్లిమర్ల: ప్రకాశరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కడలి ప్రకాశరావును ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు శనివారం పరామర్శించారు. ప్రకాశరావు భార్య అనసూయమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంట నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నల్లి శ్రీనివాసరావు, తదితరులున్నారు. అలాగే చంద్రంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కర్రోతు వెంకటరమణ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. వెంకటరమణ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శలతో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యులు వాల్లె అప్పలనాయుడు, సంగంరెడ్డి జగన్నాధం, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాఘమాస మహోత్సవాలకు సర్వం సిద్ధం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు కేఏపీ రాజు, తదితరులు

విజయనగరం టౌన్: మాఘమాస మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాబామెట్ట శివపంచాయతన ఆలయ కమిటీ అధ్యక్షుడు కేఏపీ రాజు (శివ) అన్నారు. శనివారం స్థానిక ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 22న తొలి ఆదివారం పురస్కరించుకుని ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహిస్తామన్నారు. 28న శనివారం రథ సప్తమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు..సాయంత్రం ఉషా పద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం చేపడతామని చెప్పారు. 29న రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 1న భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి తులసీదళాలతో అర్చనలు.. 5న మూడో ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా సూర్యనమస్కారాలు.. 12న నాలుగో ఆదివారం సందర్భంగా విశిష్ట పూజలు.. 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చంద్ర మౌళీశ్వరస్వామికి విశేష అభిషేకాలు.. 19న ఐదో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులందరూ మాఘమాస మహోత్సవాల్లో పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి పి.శివకుమార్, కోశాధికారి టి.సాంబమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి నుంచి బయటపడాలి..

- సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి



కిచెన్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

విజయనగరం లీగల్:

నేరాలు చేయడం అలవాటుగా మార్చుకోవద్దని.. నేరప్రవత్తి నుంచి బయటపడాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను ఆమె సందర్శించి, ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖైదీలకు అవసరమైతే సబ్ జైలులోనే కేసుల పరిష్కారానికి జైల్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖైదీలకు ఉచితంగా బెయిల్ పెట్టుకునేందుకు, కేసును వాదించేందుకు న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటిండెంట్ టి.దుర్గారావు, న్యాయవాది తాడి రాజు, పారాలీగల్ వలంటీర్లు, జైలు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

- వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు



నెల్లిమర్ల: స్టేట్ బ్యాంక్ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



విజయనగరం క్రైమ్: విద్యార్థులు, డ్రైవర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న వన్‌టౌన్ పోలీసులు



భోగాపురం: రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కృష్ణమూర్తి

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తోందని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటోడ్రైవర్లు, విద్యార్థులు, లారీ డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రైవర్లు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు అశ్రద్ధ పనికిరాదని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి..

నెల్లిమర్ల: రహదారి భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై పి. నారాయణరావు పిలుపునిచ్చారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నెల్లిమర్ల పట్టణ ప్రధాన రహదారిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ప్రమాదాలను అరికట్టాలని నినాదాలు చేశారు. అనంతరం స్టేట్ బ్యాంక్ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.

నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు..

భోగాపురం: వాహనదారులు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎస్సై కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ పార్వతి అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణమూర్తి మాట్లాడుతూ, దేశంలో రోడ్డు ప్రమాదాల వల్లే చాలామంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వెళ్లకూడదని, మద్యం సేవించి నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ



కమిషనర్ శ్రీరాములనాయుడును అభినందిస్తున్న కార్పొరేషన్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

విజయనగరం: విజయనగరం నగరపాలక సంస్థకు జాతీయ స్థాయి స్కోచ్ అవార్డుల్లో భాగంగా రజత పథకం రావడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడుకు వివిధ విభాగాల అధికారు లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శనివారం అభినందించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి అప్పలరాజుతో పాటు సిబ్బంది కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, రజత పథకం సాధించడం వెనక సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. అందరి సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.